సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



వస్తు రవాణాతో మస్తు ఆదాయం

పశ్చిమగోదావరి జిల్లాలో ఆర్టీసీ కార్గో సర్వీసు ఆదాయం ఆశాజనకంగా ఉంది. గడిచిన మూడేళ్లలో రూ.12.93 కోట్ల ఆదాయాన్ని గడించింది. 8లో ▸



మరిదే చంపేశాడు

కొత్తరామయ్యపేటలో వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో మరిదే హత్య చేసినట్లు పోలీసులు చెప్పారు. 8లో ▸



మద్ది అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. స్వామి వారికి తమలపాకులతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

1న నూర్‌బాషా దూదేకుల ఆత్మీయ సమావేశం

రాష్ట్ర అధికార ప్రతినిధి **షేక్ సయ్యద్ బాజీ**



మాట్లాడుతున్న షేక్ సయ్యద్ బాజీ

ఏలూరు (టూటౌన్): తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం మార్చి ఒకటో తేదీన జరుగుతున్నట్లు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ చెప్పారు. స్థానిక నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న నూర్‌బాషా దూదేకుల రాజకీయ ప్రతినిధులు, నూర్‌భాషా సంఘ సభ్యులు, ముఖ్య నాయకులు తప్పకుండా హాజరుకావాల్సిందిగా బాజీ కోరారు.

పాలకొల్లు కమిషనర్ బదిలీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మునిసిపల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి గుంటూరు జిల్లా రేపల్లె మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఎంఏ కార్యాలయం నుంచి మునిసిపాలిటీకి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో చీరాల మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న విజయ పార్థసారధి బదిలీపై రానున్నారు.

'టెట్'కు 90 శాతం హాజరు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 90 శాతం మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. పరీక్షకు 200 మంది అభ్యర్థులకు గాను 181 మంది హాజరయ్యారన్నారు. ఏ విధమైన మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

ఏలూరులో 585 మంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 367 మందికి 291 మంది హాజరు కాగా, 76 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 367 మందికి 294 మంది హాజరు కాగా 73 మంది గైర్హాజరయ్యారు.

నేడు అంతర్జాతీయ తెలుగు సదస్సు

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో రెండో అంతర్జాతీయ తెలుగు సదస్సు బుధవారం ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీపీ అప్పారావు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాల తెలుగు విభాగం, నన్నయ విశ్వవిద్యాలయం, తెలుగు సంపద, ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు సాహిత్య అభిమానులు, భాషాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, అధ్యాపకులు అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు పాల్గొన్నారు.

విజయోస్తు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, స్క్వాడ్ ప్రతినిధులు, కస్టోడియన్లు తదితర అధికారులకు పరీక్షల నిర్వహణపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

- మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా
- నో సెల్‌ఫోన్ జోన్‌గా కేంద్రాలు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో పరీక్షల నిర్వహణకు 51 కేంద్రాలను సిద్ధం చేశారు. వాటిలో 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలతో పాటు 30 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. ప్రతి పేరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి చొప్పున మొత్తం 51 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 51 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. వీరితో పాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 21 మంది కస్టోడియన్లను సిద్ధం చేశారు. పరీక్షా పత్రాలు, పరీక్షకు సంబంధించిన గోప్యమైన వస్తువులు, పత్రాలను భద్రపరచడానికి 18 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షల్లో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు జరుగకుండా చూసేందుకు సుమారు 800 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పశ్చిమలో సర్వం సిద్ధం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్‌ఐవో కె.చంద్రశేఖర్‌బాబు మంగళవారం చెప్పారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 17,806 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 18,143 మంది రెండో సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు చంద్రశేఖర్‌బాబు వివరించారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

మార్చి 1 నుంచి ప్రారంభమై 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు, పరీక్షకు మధ్య ఒక రోజు విరామం వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించారు. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, రెండో రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.

పరీక్షకు హాజరయ్యే మొత్తం విద్యార్థులు 32445..

ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 32445 మంది హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించడంతో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, బోధనేతర సిబ్బంది, చీఫ్ సూపరింటెండెట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవీ కలిగి ఉండరాదని అధికారులు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాన్ని సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంచారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలుకు ఆదేశాలు ఇచ్చారు. పరీక్షా కేంద్రానికి సమీపంలో ఎటువంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు..

మార్చి 1న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1, 4న ఇంగ్లిష్ పేపర్-1, 6న గణితం పేపర్-1ఏ, బోటనీ పేపర్ -1, సివిక్స్ పేపర్-1, 9న గణితం పేపర్-1బీ, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి. 12న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, 14న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1, సోషియాలజీ పేపర్-1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్-1, 19వ తేదీన చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..

మార్చి 2న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2, 5న ఇంగ్లిష్ పేపర్-2, 7న గణితం పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, సివిక్స్ పేపర్-2, 11న గణితం పేపర్-2బీ, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. 13న ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2, 15న కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2, సోషియాలజీ పేపర్-2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్-2, 20వ తేదీన చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి.

ఏలూరు జిల్లాలో..	
మొత్తం విద్యార్థులు	32,445
ప్రథమ సంవత్సరం	15,656
ద్వితీయ సంవత్సరం	16,789
పరీక్షా కేంద్రాలు	51

పశ్చిమగోదావరి జిల్లాలో..	
మొత్తం విద్యార్థులు	35,949
ప్రథమ సంవత్సరం	17,806
ద్వితీయ సంవత్సరం	18,143
పరీక్షా కేంద్రాలు	52

నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు



ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 08812-230197కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోము. విద్యార్థులంతా అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడానికి ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచనలు చేశాం. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడానికి రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకుంటున్నాం.

– బీ ప్రభాకరరావు, జిల్లా వృత్తివిద్యా శాఖాధికారి, ఇంటర్ పరీక్షల కన్వీనర్

నేడు రైతు భరోసా మూడో విడత విడుదల

ఆకివీడు: వైఎస్సార్ రైతు భరోసా (పీఎం కిసాన్) మూడో విడత సొమ్మును రైతుల బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బటన్ నొక్కి జమ చేయనున్నారు. దాళ్వా సాగుకు రైతులకు ఆర్థికంగా ఉపయోగపడే విధంగా మూడో విడత సొమ్మును విడుదల చేయనున్నారు. దీంతో పాటు సున్నా వడ్డీ సొమ్ము కూడా అందించనున్నారు. 2023-24 సంవత్సరంలో మూడో విడతగా జిల్లాలో 1,27,114 మంది రైతులకు వారి ఖాతాల్లో రూ.25,42,28,000 సొమ్ము జమ కానుంది. దీనిలో కౌలు రైతులు 6,712 మంది ఉండగా వారికి రూ.1,34,24,000 వారి ఖాతాల్లో జమ చేస్తారు. నియోజకవర్గాల వారీ వివరాలను అధికారులు వెల్లడించారు. ఆచంట నియోజకవర్గంలోని 27,286 మందికి రూ.5.45 కోట్లు, భీమవరంలో 10,823 మందికి రూ.2.16 కోట్లు, నరసాపురంలో 13,335 మందికి రూ.2.66 కోట్లు, పాలకొల్లులో 12,768 మందికి రూ.2.55 కోట్లు, తాడేపల్లిగూడెంలో 21,841 మందికి రూ.4.36 కోట్లు, తణుకులో 20,239 మందికి రూ.4.04 కోట్లు, ఉండిలో 14,356 మందికి రూ.2.87 కోట్లు, గణపవరంలో 6,466 మందికి రూ.1.29 కోట్ల సొమ్ము జమ కానుంది. అలాగే 2021-22 రబీ, 2022 ఖరీఫ్ పంట రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ సొమ్ము 39,270 మంది రైతులకు రూ.5,53,28,442లు జమ చేయనున్నారు.

3 నుంచి పీఏటీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో గుర్తించబడిన కేంద్రాల్లో మార్చి 3వ తేదీ నుంచి ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పీఏటీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురాజు

భీమవరం (ప్రకాశంచౌక్): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో మార్చి 8వ తేదీన ఉత్సవాల నిర్వహణకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో శ్రీనివాసులురాజు ఆదేశించారు. పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇతర శివాలయాల్లో ఏర్పాట్లపై మంగళవారం తన కార్యాలయంలో ఆర్డీఓ సమీక్షించారు. ఆలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన, క్యూలైన్లు, మంచినీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పారిశుద్ధ్యం, మంచినీరు, వంటివాటిపై మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచారామక్షేత్రం వద్ద, భీమేశ్వర స్వామి ఆలయం వద్ద రథోత్సవం, తెప్పోత్సవం ఏర్పాట్లపై ఆరా తీశారు. ముఖ్యంగా రథోత్సవానికి సంబంధించి ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. రథోత్సవాలు జరిగే ప్రాంతాల్లో ముందుగానే రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలన్నారు. అదే విధంగా రథోత్సవం జరిగే నాచువారి సెంటర్ నుంచి సోమేశ్వరస్వామి ఆలయం వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. కొద్దిరోజుల్లో సోమేశ్వరస్వామి ఆలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. దేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా అధికారి ఇ.సుబ్బారావు, డీఎస్పీ జి.నారాయణస్వామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.శివకుమార్, సోమేశ్వరస్వామి దేవస్థానం ఈవో డి.రామకృష్ణంరాజు, ఎం.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషన్ ఎం.శ్యామల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీవిద్య, సీఐలు అడబాల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ జి.దాసు, ట్రాఫిక్ ఎస్సై నాగలక్ష్మి, ఫైర్ ఆఫీసర్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలి

బీఐఎస్ వర్క్‌షాప్‌లో ఏపీఎస్‌ఐ ఆర్‌డీ డైరెక్టర్ జె.మురళీ



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (మెట్రో): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించే వస్తువులను నాణ్యతా ప్రమాణాలను గుర్తించి కొనుగోలు చేయాలని ఏపీఎస్‌ఐ ఆర్‌డీ డైరెక్టర్ జె.మురళీ సూచించారు. స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) వర్క్‌షాప్ నిర్వహించారు. తొలుత జె.మురళీ, పంచాయతీ రాజ్ సీనియర్ డైరెక్టర్ జె.వినోద్ వర్క్‌షాప్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బీఐఎస్ డైరెక్టర్ జె.వినోద్ మాట్లాడుతూ ప్రతి భారతీయ ఉత్పాదనకు (ఇండియన్ స్టాండర్స్ ఇనిస్టిట్యూట్) ఐఎస్‌ఐ మార్క్ లభించేలా ఉత్పత్తిదారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నాణ్యత, మన్నికపై బీఐఎస్ ఎలా నిర్ణయం తీసుకుంటుందనే అంశాలపై వివరించారు. ఏపీఎస్‌ఐఆర్‌డీ డైరెక్టర్ జె.మురళి మాట్లాడుతూ ఐదు రోజులు పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మార్కెట్‌లో ఐఎస్‌ఐ హాల్‌మార్క్‌లేని వస్తువులను కొనడం వల్ల వినియోగదారునికి కలిగే నష్టాలను వివరించారు. మార్కెట్‌లో లభ్యమయ్యే ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ సాధారణ వస్తువుల వినియోగంపై ప్రతిఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. బీఐఎస్ సీనియర్ ఫ్యాకల్టీ కె.రాజశేఖర్ మాట్లాడుతూ మార్కెట్‌లో నాణ్యమైన వస్తువుల కొనుగోలు వల్ల ఆర్థికభారం తగ్గడంతోపాటు వినియోగకాలం పెరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన 27 మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు 300 మంది హాజరయ్యారు. ఏపీఎస్‌ఐ ఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ వై.దోసిరెడ్డి, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి రజీ ఉల్లా, ఏలూరు, నూజివీడు డివిజనల్ పంచాయితీల అధికారులు హాజరయ్యారు.

నేడు పెదఅమిరంలో సీఎం పర్యటన



పెదఅమిరంలో హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం భీమవరం సమీపంలో ఉన్న పెదఅమిరంలో వైఎస్సార్ సీపీ నాయకుని ఇంట జరగనున్న వివాహ వేడుకకు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం బయలుదేరి సాయంత్రం పెదఅమిరం హెలిప్యాడ్‌కు చేరుకుంటారని స్పష్టం చేశారు. అక్కడ నుంచి పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌కు చేరుకుని వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నరసింహ నాగేంద్రరావు (నాగబాబు), రాజరాజేశ్వరి దంపతుల కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నట్లు చెప్పారు. అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి తిరుగు ప్రయాణం అవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా పెదఅమిరంలోని ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, గ్రామంలో ఉన్న కల్యాణ మండపాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ అజిత పరిశీలించారు.

పీహెచ్‌సీల్లో పెరుగుతున్న ప్రసవాలు

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో పీహెచ్‌సీల బలోపేతం
- అందుబాటులో వైద్యులు, సిబ్బంది, పరికరాలు
- ఉచిత కాన్పు, ఆసరా పథకం కింద రూ.5 వేల ఆర్థిక సాయం
- పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాది నుంచి ఇప్పటివరకు 1,853 డెలివరీలు

భీమవరం (ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర నుంచి జిల్లా ఆస్పత్రి వరకు సకాల సౌకర్యాలతో అన్ని రకాలుగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండడంతో కాన్పుల సంఖ్య పెరుగుతోంది. ఈ కేంద్రాల్లో నెలకు మూడు నుంచి ఐదు చొప్పున డెలివరీలు జరుగుతుండటమే కాక సహజ డెలివరీలు సైతం ఉంటున్నాయి. జిల్లాలో పీహెచ్‌సీలు 34 ఉండగా, అన్నిచోట్లా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది, మందులు, సౌకర్యాలు అందుబాటులో ఉండటమే కాన్పుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి.

ఇప్పటివరకు 2,098 డెలివరీలు : పశ్చిమగోదావరి జిల్లాలో 2022-2023 నుంచి 2023 -2024 వరకు ఈ జనవరి నాటికి జిల్లాలోని 34 పీహెచ్‌సీల్లో మొత్తం 2,098 డెలివరీలు జరిగాయి. ఇందులో గతేడాది 1,224 డెలివరీలు కాగా ఈ ఏడాది జనవరికి నాటికి 874 డెలివరీ చేయడం విశేషం.



కాళ్ల పీహెచ్‌సీలో శిశువును పరీక్షిస్తున్న వైద్యురాలు

పీహెచ్‌సీలో సిబ్బంది ఇలా..

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సులు-3, ఫార్మాసిస్టు-1, సూపర్‌వైజర్లు-2, ల్యాబ్ టెక్నిషియన్-1 చొప్పున అందుబాటులో ఉంటున్నారు.

పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది వివరాలు

మొత్తం పీహెచ్‌సీలు	34	సిబ్బంది	204
వైద్యులు	68	గర్భిణులు	19,366



మార్టేరు పీహెచ్‌సీలో తల్లీబిడ్డతో వైద్యులు, సిబ్బంది

ఉచిత వైద్యం, విశ్రాంతికి ఆర్థిక సాయం

పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా డెలివరీ చేయడమే కాక బాలింత విశ్రాంతి కోసం ఆసరా పథకం ద్వారా పౌష్టికాహారం కోసం రూ.5 వేలను ప్రభుత్వం అందిస్తోంది. జిల్లాలో కాన్పు అయిన బాలింతలకు ఇప్పటివరకు ప్రభుత్వం ఆసరా కింద రూ.1.49 కోట్లు ఖర్చు చేసింది.

కాళ్ల పీహెచ్‌సీలో అత్యధికంగా 72 డెలివరీలు

జిల్లాలో గడిచిన 10 నెలల కాలంలో 72 డెలివరీలు చేసి అన్ని పీహెచ్‌సీల కంటే కాళ్ల పీహెచ్‌సీ ప్రథమస్థానంలో నిలిచింది. నెలకు సగటున ఏడు డెలివరీలు కాళ్ల పీహెచ్‌సీలో జరిగాయి. తర్వాత స్థానంలో 49 డెలివరీలతో పెనుమంట్ర పీహెచ్‌సీ నిలిచింది.

కాన్పుల సంఖ్య పెంచేలా చర్యలు



జిల్లాలోని పీహెచ్‌సీల్లో డెలివరీలు మరింత ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నెలకి 5 నుంచి 10 వరకు డెలివరీలు జరిగేలా వైద్యులు, సిబ్బంది, ఆశలు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్నాం. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత లేదు. సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీలో ఉచితంగా డెలివరీ చేయడంతో పాటు బాలింతకు పౌష్టికాహారం కోసం ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామానికి వచ్చే వైద్యులకు గర్భిణులు ఎప్పటికప్పుడు చూపించుకుని వైద్య సలహాలు, సూచనలు పొందాలి. సరైన ఆహారం, వ్యాయామం, సక్రమంగా మందులు తీసుకోవడం ద్వారా సాధారణ కాన్పు జరిగే అవకాశం ఉంటుంది.

– డి.మహేశ్వరరావు, డీఎం అండ్ హెచ్‌ఓ

గతంలో ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో డెలివరీలు జీరో

నాడు చంద్రబాబు పాలనలో జిల్లాలోని ఏ ఒక్క పీహెచ్‌సీలోనూ డెలివరీలు చేసే పరిస్థితి లేదు. అప్పట్లో గర్భిణులను డెలివరీల కోసం పీహెచ్‌సీలకు తీసుకువచ్చినా తగిన వైద్యం అందుబాటులో లేకపోవడమే కారణం. వైద్యులు, సిబ్బంది, పరికరాల కొరత కారణంగా డెలివరీలు చేసే పరిస్థితి లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి పేదలు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. నేడు వైఎస్ జగన్ పాలనలో పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో డెలివరీల సంఖ్య పెరుగుతోంది.

క్లుప్తంగా

వైనాట్ షోరూమ్ ద్వారా నాణ్యమైన సేవలు


బహుమతులు అందజేస్తున్న డాక్టర్ టి.రామబ్రహ్మం, జేవీ రాయుడు

తణుకు టౌన్: వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన సేవలను అందించడం ద్వారానే వైనాట్ షోరూం 30 ఏళ్లుగా ప్రజల ఆదరణ పొందినట్లు ఆ సంస్థ అధినేత జేవీ రాయుడు చెప్పారు. మంగళవారం రాత్రి తణుకులోని వైనాట్ షోరూంలో నిర్వహించిన 30వ వార్షికోత్సవాల్లో ఆయన తన ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం వైనాట్ సంస్థను ప్రారంభించిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ టి.రామబ్రహ్మం నేడు 31వ బ్రాంచి ఏర్పాటు, 30వ వార్షికోత్సవాల కేక్‌ను కట్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర, తెలంగాణల్లో రాష్ట్రాలు వై నాట్ బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. అనంతరం లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెంటపాడు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో సంచార పశువైద్యసేవా వాహనాల్లో డ్రైవర్ పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశువైద్య అంబులెన్స్ మేనేజర్ (ఈఎంఈ) శివతేజ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పాలకొల్లు, నరసాపురం, యలమంచిలి కేంద్రాల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. హెవీ లైసెన్స్ కలిగి సుమారు 2 ఏళ్ల డ్రైవింగ్ అనుభవం ఉన్న దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాసు చేసుకునే అభ్యర్థులు 91105 95889కు ఫోన్ చేయాలని సూచించారు.

వస్తు రవాణాతో మస్తుగా ఆదాయం


భీమవరంలో కార్గో సర్వీసు సెంటర్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న పార్శిల్స్


కార్గో బుకింగ్ చేస్తున్న సిబ్బంది

- ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా మంచి ఆదాయం
- గడిచిన మూడేళ్లలో రూ. 12.93 కోట్ల ఆదాయం
- జిల్లాలో 4 డిపోల ద్వారా కార్గో సర్వీసులు
- కార్గో సర్వీసు కోసం 5 ప్రత్యేక బస్సుల ఏర్పాటు

భీమవరం(ప్రకాశం చౌక్): వస్తు రవాణా (కార్గో) సర్వీసుల్లో పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ మంచి ఆదాయాన్ని ఆర్జిస్తుంది. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం, తణుకు ఈ నాలుగు ఆర్టీసీ డిపోలు ద్వారా కార్గో సర్వీసు ప్రజలకు అందిస్తున్నాయి. 2017లో ప్రారంభించిన ఆర్టీసీ కార్గో సర్వీస్ ప్రజలకు మంచి సేవలు అందిస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తుంది. వస్తువులను రవాణా చేయడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వస్తువులను 10 కిలోమీటర్లు లోపు వరకు హోమ్ డెలివరి చేస్తున్నారు. ఇందుకు కేవలం రూ.30 రూపాయలు చార్జ్ తీసుకుంటున్నారు. 84 ప్రధాన సెంటర్లుకు హోమ్ డెలివరీ చేస్తున్నారు.

కార్గో సర్వీసులు ఇలా

హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ, బెంగుళూరు, చెన్నై తదితర దూర ప్రాంతాల పాటు రాష్ట్రంలో అని ప్రాంతాలకు కార్గో ద్వారా పార్సిల్స్ పంపవచ్చు. వస్తువు బరువు, దూరం బట్టి సాధారణ చార్జ్ రూ.65 రూపాయల నుంచి ఆ వస్తువు బరువు దూరం బట్టి చార్జ్ వసూళ్లు చేస్తూ ఉంటారు. జిల్లాలోని నాలుగు డిపోల కార్గొ పార్శల్ రవాణాకు ప్రత్యేకంగా మొత్తం 5 బస్సులను ఏర్పాటు చేశారు. వాటితో పాటు ప్రజలను రవాణా చేసే బస్సుల ద్వారా కూడా కార్గో పార్శల్స్ రవాణా చేస్తున్నారు.

మూడేళ్లలో రూ.12.93 కోట్లు

గడిచిన మూడేళ్లలో జిల్లాలోని నాలుగు డిపోలకు సంబంధించి కార్గో సర్వీసులు ద్వారా రూ.12.93 కోట్లు ఆదాయం ఆర్టీసీకి వచ్చింది. కార్గో ఆదాయంలో జిల్లాలోని భీమవరం డిపో ముందంజలో ఉంది. ఈ డిపో కార్గో ద్వారా మూడేళ్లలో రూ.3.50 కోట్లు సాధించింది. రెండో స్థానంలో తాడేపల్లిగూడెం డిపో రూ.3.19 కోట్లు సాధించింది.

తక్కువ ఖర్చుకే సేవలు

డోర్ డెలివరీలు విజయవంతంగా వినియోగదారులకు అందించడం, తక్కువ ఖర్చుతో వస్తువులను రవాణా చేయడం, సమయానికే పార్శిల్ అందించడం, పార్శిల్‌కు ఇబ్బంది లేకుండా తీసుకెళ్లి భద్రంగా అందించడం తదితర కారణాల వల్ల ప్రజలు ఆర్టీసీ కార్గోను ఉపయోగించుకోవడంతో ఆర్టీసీ కార్గోకు మంచి ఆదాయం లభిస్తుంది. దీనితో పాటు వినియోగదారులకు సౌకర్యంగా చిల్లర సమస్యలేకుండా ఉండేందుకు ఫోన్‌పే, గూగల్ పే వంటి యూపీఐ పేమెంట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

డిపోల వారిగా కార్గో ఆదాయం

డిపో	2021	2022	2023	బస్సులు
తాడేపల్లిగూడెం	రూ.108.87 లక్షలు	రూ.1.47 కోట్లు	రూ.109.99 లక్షలు	2
భీమవరం	రూ.114.30 లక్షలు	రూ.98.23 లక్షలు	రూ.137.58 లక్షలు	1
నరసాపురం	రూ.66.23 లక్షలు	రూ.65.66 లక్షలు	రూ.86.48 లక్షలు	1
తణుకు	రూ.84.60 లక్షలు	రూ.86.11 లక్షలు	రూ.116.16 లక్షలు	1

ప్రజలకు చేరువగా కార్గో సర్వీసులు



వస్తు రవాణా సేవల్లో ఆర్టీసీ జిల్లా ప్రజలకు చేరువైంది. కార్గో సర్వీసు ద్వారా మంచి ఆదాయం ఆర్జిస్తున్నాం. ఇది చాలా శుభపరిణామం కార్గో విజయవంతంగా నడవడం వెనుక డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, హమాలీలు సమష్టి కృషి, కష్టం ఉంది. గడిచిన మూడేళ్లలో రూ.12 కోట్లు దాటి ఆదాయం సాధించాం. హోమ్ డెలివరీ సౌకర్యంతో ప్రజలు కార్గోను సౌకర్యాన్ని చక్కగా ఉపయోగించుకుంటున్నారు. పార్శిల్స్ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రవాణా చేయడంతో పాటు డెలివరి చేస్తున్నాం. నిషేధిత వస్తువులపై పూర్తి నిఘా పెట్టాం. – ఎ.వీరయ్య చౌదరి, జిల్లా ప్రజా రవాణా అధికారి, భీమవరం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంఘటనా స్థలంలో నర్సమ్మ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు–నరసాపురం రోడ్డులో జరిగిన ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం మంగళవారం నరసాపురం మండలం సీతారామపురం గ్రామం పిల్లిపేటకు చెందిన మేడిది నరసింహస్వామి, భార్య వెంకట నర్సమ్మ (45) ద్విచక్ర వాహనంపై పాలకొల్లులోని ఎల్ఐసీ కార్యాలయానికి వస్తున్నారు. పాలకొల్లు టిడ్కో గృహాల సముదాయం ఎదురుగా నరసాపురం రోడ్డులో నరసాపురం నుంచి భీమవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి తమ వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో భార్య వెంకట నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందగా నరసింహ స్వామి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్టీసి అధికారులు మాత్రం ద్విచక్ర వాహనదారుడు రోడ్డు మార్జిన్ ఎక్కుతుండగా వాహనం స్లిప్ అయ్యి హ్యాండిల్ బార్ బస్‌కు తగిలిపడిపోయినట్లు చెపుతున్నారు. మృతురాలి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై మార్‌లింగం కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నరసాపురం ఆర్టీసి డీఎం సుబ్బన్నరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నరసాపురంలో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం


మంటల్లో కాలిబూడిదవుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్

నరసాపురం: పట్టణంలోని స్టీమర్‌రోడ్డు జంక్షన్ వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో మంగళవారం రాత్రి 7.50 గల సమయంలో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధమైంది. ఏం జరిగిందో? తెలియక ఒక్కసారిగా జనం పరుగులు తీశారు. పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి తన్మయి శ్రీనివాస్ ఎలక్ట్రిక్ స్కూటర్‌పై ప్రకాశం రోడ్డు నుంచి స్టీమర్ రోడ్డుపై వెళుతున్నారు. వైఎస్సార్ విగ్రహం వద్దకు వచ్చేసరికి స్కూటర్ నుంచి మంటలు రావడాన్ని గమనించి వెంటనే తేరుకుని స్కూటర్‌ను రోడ్డుపై పడేసి పక్కకు పరుగుతీశాడు. రెండు నిమిషాల వ్యవధిలో స్కూటర్ మొత్తం కాలిబూడిదైంది. రద్దీగా ఉండే ప్రాంతం, వ్యాపార సముదాయాలు ఉండడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

సరిపల్లిలో సంగీత దర్శకుడు డేవ్‌జాండ్ సందడి


డేవ్‌జాండ్‌తో సరిపల్లి గ్రామస్తులు

నరసాపురం రూరల్: ఈగల్ సినిమాతో కెరీర్ ప్రారంభించిన యువ సంగీత దర్శకుడు డేవ్ జాండ్ మంగళవారం తన స్వగ్రామం నరసాపురం మండలం సరిపల్లి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు, సంగీతప్రియులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డేవ్‌జాండ్ మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ప్రాణమని అన్నారు. విభిన్న కథా చిత్రాలకు సంగీతం అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. తనను హీరో రవితేజ తనను ఎంతగానో ప్రోత్సాహించారని ఆయన అభిమానాన్ని మరువలేనన్నారు. అనంతరం పలువురు గ్రామపెద్దలు సర్పంచ్ ఈదా సురేష్‌బాబు సమక్షంలో యువ సంగీత దర్శకుడు డెవ్‌జాండ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యువెంకట్రావు, మధుబాబు, రాజ్ కుమార్, సోడదాసి శ్రీదర్, నాని, రిక్కీ, రాజేష్, రాంబాబు తదితరులు ఉన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి

పోలవరం రూరల్: కొత్తరామయ్యపేట పునరావాస కేంద్రంలో మేదూరి దుర్గ (38) అనే వివాహిత హత్య కేసులో నిందితుడిని మంగళవారం పోలవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పోలవరం డీఎస్పీ కార్యాలయంలో హత్యకు సంబంధించిన కారణాలను విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి వివరించారు. కొత్త రామయ్యపేట పునరావాస కేంద్రం ప్రాంతానికి చెందిన మేదూరి దుర్గ (28)కు, సమీప బంధువు, వరుసకు మరిది అయిన మేదూరి ప్రసాద్ మధ్య గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. అయితే నెల రోజుల నుంచి దుర్గ వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు అనుమానంతో ప్రసాద్ ఆమెతో గొడవ పడుతున్నాడు. ఆదివారం రాత్రి ప్రసాద్ దుర్గకు అనేకమార్లు ఫోన్ చేయగా, దుర్గ వేరే వారితో మాట్లాడుతుడంతో ఫోన్ కలవలేదు. ఫోన్ తీయడం లేదనే కోపంతో ప్రసాద్ దుర్గ ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. వెంటనే ప్రసాద్ తన వెంట తెచ్చుకున్న చాకుతో దుర్గ కంఠం కోసి, ఇంటి వెనుక వైపున మామిడి తోట నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే గాయం తీవ్రంగా కావడంతో దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రసాద్ హత్య చేసిన అనంతరం దుర్గ ఫోన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. సమీపంలోని మొక్కజొన్న చేలో ప్రసాద్ బట్టలు, ఫోన్, చాకు దాచి ఉంచాడు. ఘటన జరిగిన వెంటనే పోలవరం సీఐ కె.మధు బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. మృతురాలి ఫోన్ కనబడకపోవడంతో అనేక కోణాల్లో దర్యాప్తు చేశారు. ఘటన జరిగిన రెండు రోజుల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో వాస్తవాలు తెలిశాయన్నారు. నిందితుడిని మంగళ వారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేయడంపై జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుడిని త్వరితగతిన పట్టుకున్నందుకు రివార్డులు కూడా ప్రకటిస్తామని డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన పూజలు



ఐశ్వర్య గణపతికి క్షీరాధివాసం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో ఐశ్వర్య గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఐశ్వర్య గణపతి విగ్రహానికి జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం ఇత్యాధి పూజా కార్యక్రమాలను జరిపారు. అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్బారావుపేటలో బేటీ బచావో-బేటీ పఢావో



భవిత కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో మంగళవారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్, పేరిచర్ల ఫౌండేషన్, అభయం, లియో క్లబ్‌లు సంయుక్త ఆధ్వర్యంలో పలు అంశాలపై ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆడపిల్లను చదివించాలని అప్పుడే వారు అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు.

అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న మామిడిదాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం కోతి బొమ్మ సెంటర్‌లు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.దానవరప్రసాద్ మాట్లాడుతూ పని చేస్తున్న కార్మికులకు ప్రస్తుత టెక్నాలజీలో ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్మికుల అన్ని రకాలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దుర్గా ప్రసాద్, శేఖర్, వెంకటేశ్వరరావు, వాసు, నమ్మి శ్రీనివాస్, పాండురంగారావు, రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



వైవీ సుబ్బారెడ్డితో మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు తాడేపల్లిలో మంగళవారం రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తున్నాని, ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్తున్నాని వివరించినట్లు పేర్కొన్నారు.

మహిళా పోలీస్ మౌనికకు డాక్టరేట్



మౌనిక పెర్సిస్

నరసాపురం రూరల్: నరసాపురం మండలం దర్భరేవు గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి రుస్తుంబాదకు చెందిన వడ్లపాటి మౌనిక పెర్సిస్‌కు డాక్టరేట్ లభించింది. బిఎస్సీ, బిఈడీ, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన ఆమె గతంతో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సచివాలయంలో పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మౌనిక పెర్సిస్ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ సంధ్యా శ్రీదేవి ఆధ్వర్యంలో హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధన చేశానన్నారు. ఈ పరిశోధన పూర్తి చేయడంలో తన భర్త మీసరపు శ్యాంబాబు ప్రోత్సాహం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా మైనికా పెర్సిస్‌ను దర్భరేవు, సీతారాంపురం సౌత్, రుస్తుంబాద గ్రామాల సర్పంచ్‌లు, పెన్మెత్స విజయలక్ష్మి, దొండపాటి వెంకట్, బందెల భారతి, ఎంపీడీఓ ఎంవీ రమణారావు, ఎస్సై గురవయ్య, తదితరులు అభినందించారు.

నాడు-నేడుతో విరాజిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు
- నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి రూ. 149.53 కోట్లు..
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు కలుగజేసి పేదింటి బిడ్డల విద్యకు ప్రాధాన్యతనివ్వాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు- నేడు పథకం ప్రజల మన్ననలు పొందుతుంది. ఈ పథకంలో భాగంగా రెండు విడతల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన వైనాన్ని దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. దీంతో పేదవర్గాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు చొరవ చూపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా భవనాల సుందరీకరణతోపాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మౌలిక వసతుల రూపకల్పనతో పాఠశాలలు విరాజిల్లుతున్నాయి. ప్రభుత్వం విద్యాశాఖకు ఎంతో ప్రాధాన్యత కల్పించడంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. విద్యార్థులకు సులభ బోధనా పద్ధతుల్లో భాగంగా స్మార్ట్ స్క్రీన్‌లు సైతం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థులు, తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నాడు-నేడు నిధుల ద్వారా పాఠశాలల భవనాల నిర్మాణాలతో పాటు ప్రహరీలు, పాఠశాలలో అవసరమైన ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్స్, వాష్ ఏరియా, పెయింటింగ్స్ వంటి వసతులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసింది.



తణుకులో రూ. 3.50 కోట్లు నాడు నేడు నిధులతో అభివృద్ధి చేసిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల



తణుకులో నాడు నేడు నిధులతో తీర్చిదిద్దిన రాజీవ్ గాంధీ నంబరు 14 మునిసిపల్ ప్రాథమికోన్నత పాఠశాల



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక డెస్కులు

రూ.149.53 కోట్లతో అభివృద్ధి

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 163 పాఠశాలలు ఉండగా నాడునేడు పథకంలో భాగంగా 140 పాఠశాలలను రూ. 149.53 కోట్లు నిధులతో అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో వసతులు పెరగడంతో పాటు అమ్మ ఒడి రూపంలో తల్లి తండ్రుల ఖాతాల్లో ప్రతి ఏడాది రూ. 15 వేలు నగదు జమకావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నియోజకవర్గంలో 2018-19లో విద్యార్థుల సంఖ్య 14489 ఉండగా నేడు 15811కు పెరిగింది.

నాడు నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయి



నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. పేదల విద్యకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ఆహ్లాదకరమైన వాతావరణంలో తీర్చిదిద్దబడ్డాయి. పాఠశాలల్లో వసతులు పెరగడంతో తల్లి తండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు చొరవ చూపించడంతో విద్యార్థులసంఖ్య కూడా పెరిగింది.

– ఎస్.శ్రీనివాసరావు, ఇరగవరం మండల విద్యాశాఖాధికారి

విద్యతోనే సమాజ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. తణుకు నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి. విద్యతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని నమ్మిన వ్యక్తి సీఎం జగన్.

– రామిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి

నియోజకవర్గానికి రూ. 149.53 కోట్లు



నాడు-నేడు పథకంలో భాగంగా తణుకు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మిగిలిన అసెంబ్లీల కన్నా అత్యధికంగా రూ. 149.53 కోట్లు నిధులు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చే శారు.

– వీరమల్లు ఫణీంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు

వీరంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

తాడేపల్లిగూడెం రూరల్: అందరి ఆరోగ్యానికి రక్ష-గనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని వీరంపాలెం సర్పంచ్ కేతిరెడ్డి మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని వీరంపాలెం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గ్రామంలోని ప్రతీ ఒక్కరూ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. అనంతరం వైద్యులు ఎస్.శ్రీహర్ష, కే.సాంబశివరావు, షేక్ అస్మత్ ఉన్నీసా బేగంలు రోగులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ సుజాత, బంగారుగూడెం చంద్రు తేజస్విని, ఎంపీటీసీ సభ్యులు బుర్ల సుబ్బలక్ష్మి, జంపెల్లి సత్యవతి, కేతిరెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీరంపాలెం సచివాలయం వద్ద రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన జట్టు సభ్యులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

తణుకు టౌన్: ఉమ్మడి జిల్లా కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక పోటీలలో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని అంబేడ్కర్ గ్రౌండ్‌లో జిల్లా పురుషుల కబడ్డి జట్టు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్న కబడ్డీ అసోసియేషన్ నాయకులు మరడాని అత్యుతరావు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, కార్యదర్శి చిట్టిబాబులు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపిక చేసిన జిల్లా కబడ్డి జట్టు సభ్యులు మార్చి 3 నుంచి 5 వరకూ విశాఖలో జరిగే కబడ్డి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డి ప్లేయర్లు కొమ్మటి రంగారావు, వ్యాయామ ఉపాధ్యాయడు సంకు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు ప్రథమ స్థానం

భీమవరం: ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టం ఇన్ ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ ఫెసిలిటీస్ అనే అంశంపై తమ కళాశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు ప్రాజెక్టుకు అంతర్జాతీయ సదస్సులో బహుమతి లభించిందని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో బహుమతిసాధించిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సదస్సులో తమ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల బృందం రూపొందించిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించడంతో రూ.10 వేలు నగదు బహుమతినందుకున్నారన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎస్.గోపాలకృష్ణమూర్తి, ప్రాజెక్ట్ మెంటర్ కురెళ్ళ పవన్‌కుమార్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సుకు సుమారు 1,000 ప్రాజెక్టులు పరిశీలనకు రాగా తమ కళాశాల విద్యార్థులు దీపిక, కె సిరిచాతుర్య, డి.జైదురా, పి.జేమ్స్, ఏతపీ సాయి, వి.కుసుమరేణుక, యు.సత్యసాయి రూపొందించిన ప్రాజెక్టు బహుమతి దక్కించుకుందన్నారు. అనంతరం విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు తదితరులు అభినందించారు.



అంతర్జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధమవుదాం

ఆకివీడు: ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధమవుదామని, బూత్ కమిటీల నాయకులు సైనికుల్లా పని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే. కన్వర్షన్స్ ఫంక్షన్ హాల్లో మంగళవారం మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమానికి తనతో పాటు భీమవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, నియోజకవర్గంలోని మండల, జేసీఎస్, పట్టణ నాయకులు హాజరయ్యారని నర్సింహరాజు చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లి అందజేశామో అదే విధంగా ఎన్నికల్లో ప్రతి ఓటరును కలుసుకుని ఓటు వేసే విధంగా బూత్ కమిటీల ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారని చెప్పారు. ఎన్నికల రణరంగంలో బూత్ స్థాయి నాయకత్వం ఎంతో కీలకమైనదన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తే పథకాలన్నీ పొందే అవకాశం ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని వివరించారన్నారు. విజయం మనవైపే ఉందని, 175 స్థానాలు గెలిచి తీరుతామని సీఎం స్పష్టం చేసినట్లు నర్సింహరాజు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకురాలు పిళ్ళంగోళ్ల శ్రీ లక్ష్మి, వైఎస్సార్ సీపీ ఆకివీడు, కాళ్ల, ఉండి మండల కమిటీ అధ్యక్షులు అన్యెం కృష్ణ, గణేశ్న రాంబాబు, ఆంజనేయరాజు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ధనుంజయ్, మండల జేసీఎస్ కన్వీనర్లు పుప్పాల పండు, శిరపు శ్రీనివాస్, గంగయ్య, రాధాకృష్ణ, రామకృష్ణ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, నియోజకవర్గ పోలింగ్ బూత్ కన్వీనర్ ఎండీ.జహంగీర్ పాల్గొన్నారు.



మంగళగిరిలోని సీకే కన్వర్షన్స్ ఫంక్షన్ హాల్లో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్న ఉండి నియోజకవర్గ నాయకులు

ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సజ్జాపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యుడు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు హాజరై 32 మంది వృద్ధులకు వైద్యసేవలందించారు. సుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాబీరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

తణుకు అర్బన్: తణుకు కోర్టులో మార్చి తొమ్మిదిన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి వాయిదా వేసినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి మంగళవారం తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ మార్పు జరిగిందని పేర్కొన్నారు. కక్షిదారులు, పోలీసు అధికారులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ తదితర యాజమాన్యాలు ఈ మార్పును గమనించి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కోరారు. పట్టణ చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం మంగళవారం సభ నర్మాల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. నాయకులు సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనివాస్, చిర్ల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలకు ఉచిత గుండె వైద్య పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ 15 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి నోటుకు ఓటు వద్దే వద్దు అంటూ నినాదాలు చేస్తూ ఓటర్లను చైతన్య పర్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలు సుకుని అందరూ ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం ఎంపీడీవో, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన మూడు వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్ సీఐ కె.కాత్యాయని మంగళవారం తెలిపారు. అయిభీమవరం రోడ్డులోని సెబ్ కార్యాలయ ప్రాంగణంలో 2 యాక్టీవాలు, పల్సర్ బైక్‌ను భీమవరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం వేస్తారని తెలిపారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

ఇరగవరం : సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం అని ఎస్సీ సెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు పాట్ల సురేష్ అన్నారు. మంగళవారం ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్ అధ్యక్షతన మండలంలో ఎస్సీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, దళితులు, వెనుకబడిన వర్గాలకు అనేక రాజకీయ, నామినేటెడ్ పదవులు ఇచ్చారని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలపై జనంలోకి వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని, రాష్ట్రంలోన్ని 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లలో అన్నింటినీ గెలుచుకునే విధంగా కృషిచేయాలని చెప్పారు. కన్వీనర్ జాకబ్ బాబు మాట్లాడుతూ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎంతో శ్రమించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా కారుమూరిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కంకిపాడు వెంకన్న, నేతలు మల్లిపూడి కుమార్, తోట నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరంలో మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు

వలంటీర్ల సేవలు అమోఘం

కాళ్ల: వలంటీర్లు అమోఘమైన సేవలందిస్తున్నారని వారి కృషిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గుర్తించి అవార్డులు ప్రదానం చేసి ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని మాలవానితిప్ప సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు తెలిపారు. మాలవాని తిప్ప నుంచి వలంటీర్‌గా సేవలందించి సేవ వజ్ర అవార్డుకు ఎంపికైన పి బెంజిమెన్‌కు సత్కార కార్యక్రమం మంగళవారం గ్రామంలో నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లో ప్రజలకు సేవ చేసే భాగ్యం యువతకు కల్పించారని స్పష్టం చేశారు. మండలంలో మాలవానితిప్ప గ్రామం నుంచి సేవా వజ్రా అవార్డుకు ఎంపికైన పి బెంజిమెన్‌ను ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బరాజు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంతో పాటు సర్పంచ్ సుబ్బరాజు తమకు ప్రతినెల రూ.500 నగదు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎన్ రాజు, సచివాలయ కార్యదర్శి ఈ.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సేవా వజ్రకు ఎంపికైన వలంటీర్ బెంజిమెన్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ సుబ్బరాజు

వరి పైరులో జింకు ధాతు లోపం

పాలకోడేరు: మండలంలోనీ ఈ రబీ సీజన్‌లో రైతులు 11,440 ఎకరాల్లో వరి నాట్లు వేయగా అక్కడక్కడ వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల జింక్ ధాతు లోపం అధికంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వి నారాయణరావు తెలిపారు. మండలంలోని పెన్నాడ, గొరగనమూడి, శృంగవృక్షంలో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు రైతులు ప్రతి ఎకరానికి 200 గ్రాములు చిలామిన్ లేదా 200 గ్రాముల మహా జింక్ వరి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. సల్ఫైడ్ లోపం నివారణకు చేలను సాధ్యమైనంత వరకు ఎండగట్టడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చునన్నారు. పండుటాకు తెగులు ఉన్న పంటపై కాపర్ ఆక్సైడ్ పిచికారీ చేయాలన్నారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు.



గొరగనమూడిలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి నారాయణరావు

శ్రీరామనామస్మరణతో మార్మోగిన ఆనందపురం

కాళ్ల: శ్రీరామనామ స్మరణతో ఆనందపురం గ్రామం మార్మోగింది. కోదండ రామాలయం ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కాళ్ల మండలం శివారు ఆనందపురంలో భక్తులు, దాతలు, గ్రామప్రజలు సహాయసహకారాలతో నూతనంగా నిర్మించిన కోదండరామాలయం ఆలయ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. బుధవారం 7.35 గంటలకు వేదమంత్రాల నడుమ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ, ఉదయం 10.02 గంటలకు అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్దరాజు శ్రీనివాసరాజు, ముదునూరి సాయిరాజు, బండారు దుర్గారావు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కోదండ రాముని ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ పూజలు

ఉండి: చెరుకువాడలో పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో దేవదాయ నిధులు రూ.కోటి, దాతల సహకారంతో రూ.కోటి మొత్తం రూ.2 కోట్లతో రెండు ఆలయాలు అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్నాయి. మూడు రోజులు పాటు చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం పది మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మూడోరోజు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు. ఆరో రోజులపాటు పూజలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, గ్రామ పెద్దలు పెన్మత్స బాబీ, కట్టా నర్సింహమూర్తి, నడింపల్లి కృష్ణంరాజు, సన్నిధి నర్సింహమూర్తి, గ్రామ పెద్దలు, ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.